మీ ప్రాంతంలో జరుగుతున్న అవినీతి బయట పెట్టాలని ఉందా? నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా?
ఇది కద నిజం తెలుగు దినపత్రిక
జిల్లా ఇన్చార్జులు మరియు విలేకరులు కావలెను
6300490170, 9848983329
www.edikadanijam.com

Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక

మీ ప్రాంతంలో జరుగుతున్న అవినీతి బయట పెట్టాలని ఉందా? నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా?
ఇది కద నిజం తెలుగు దినపత్రిక
జిల్లా ఇన్చార్జులు మరియు విలేకరులు కావలెను
6300490170, 9848983329
www.edikadanijam.com

బుధవారం 09-09-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :2 | సంచిక :83 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## దామరకుంటలో రచ్చ.. బీఆర్ఎస్ నేతల అరెస్ట్!



- కేటీఆర్, హరీశ్‌రావు పోలీసుల అదుపులో
- కేసీఆర్ ఫామ్‌హౌస్ వైపు బీఆర్ఎస్ నేతల పయనం
- హకీంపేట వద్ద అడ్డుకున్న పోలీసులు
- బొల్లారం వద్ద తీవ్ర ఉద్రిక్తత
- పోలీసులతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వాగ్వాదం
- కాలినడకన ఎర్రవల్లి వైపు బయలుదేరిన నేతలు
- బోయినపల్లి, జవహర్‌నగర్ స్టేషన్లకు తరలింపు

## ఏపీ అభివృద్ధికి చంద్రబాబు బిగ్ ప్లాన్!

- 15-20 రంగాల్లో జీడీపీ పెంపు
- డేటా సెంటర్లతో భారీ ఉద్యోగాలు
- రూ.20.35 లక్షల కోట్ల జీఎస్డీపీ
- నీటి వనరులపై ప్రత్యేక దృష్టి
- 36 ప్రాజెక్టులకు రూ.35 వేల కోట్లు
- 1,400 టీఎంసీల నీటి నిల్వ లక్ష్యం
- నంబర్-1 డెవలపర్‌గా ఏపీ లక్ష్యం



న్యూస్ డెస్క్, 08 సెప్టెంబరు (ఇది కద నిజం): ఆంధ్రప్రదేశ్ అన్ని విధాలుగా అభివృద్ధి చేయడంపై ఫోకస్ పెట్టారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. రాష్ట్ర స్థూల అభివృద్ధిని నియోజకవర్గ స్థాయి అభివృద్ధితో అనుసంధానం చేయాలని అన్నారు. అమరావతిలో జరిగిన టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో సుస్థిర అభివృద్ధి, నీటి వనరులు, పెట్టుబడులు, ఉపాధి, మౌలిక వసతులు, నియోజకవర్గాల ఆర్థిక ప్రగతిపై ఆయన కీలకంగా మాట్లాడారు. ప్రతి ప్రాంతంలో అభివృద్ధి ఫలాలు కనిపించేలా ప్రణాళికలు రూపొందించాలని పార్టీ నాయకులకు సూచించారు. నియోజకవర్గాల గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్‌లో విజయవాడ సెంట్రల్, పాలకొల్లు, మండపేట, చిలకలూరిపేట, నెల్లూరు సిటీ, తణుకు ముందంజలో ఉన్నాయని చంద్రబాబు తెలిపారు. రాష్ట్ర స్థాయి అభివృద్ధితో పాటు నియోజకవర్గాల ఆర్థిక వ్యవస్థను కూడా బలోపేతం చేయాలని చెప్పారు. 15 నుంచి 20 రంగాల్లో జీడీపీ పెరిగేలా ప్రతి నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

**ప్రజల్లో అభివృద్ధిపై సానుకూల అభిప్రాయం పెరగాలి**

ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని చంద్రబాబు అన్నారు. విమర్శలను కూడా సానుకూలంగా మార్చుకుని ప్రజల మద్దతు కూడగట్టాలని 2 లో

## 'డీఎస్సీ అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి'

- డీఎస్సీ అక్రమాలపై సజ్జల ఫైర్
- 'క్యాష్ ఫర్ టీచర్ పోస్ట్'
- ఉద్యోగాల అమ్మకంపై ఆరోపణలు
- లోకేష్‌దే పూర్తి బాధ్యత
- ప్రభుత్వం కవరప్ చేస్తోందంటూ ఫైర్
- సమగ్ర విచారణకు డిమాండ్
- లోకేష్ రాజీనామా చేయాలి

2 లో

## బుల్లెట్ రైలుకు బిగ్ అప్‌డేట్!

- 320 కిమీ వేగంతో పరుగులు
- 12 స్టేషన్లతో హైస్పీడ్ కారిడార్
- 2027లో తొలి సర్వీస్ లక్ష్యం
- సూరత్-బిలిమోరా సెక్షన్ రెడీ
- డిసెంబర్‌లో వాపీ-సూరత్ పనులు
- ముంబై-అహ్మదాబాద్ 3 గంటల్లో
- 2029లో పూర్తి కారిడార్ అందుబాటులో



న్యూస్ డెస్క్, 08 సెప్టెంబరు (ఇది కద నిజం): భారతీయుల కలల ప్రాజెక్ట్ అయిన తొలి బులెట్ రైలు త్వరలోనే పట్టాలెక్కబోతోంది. దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ముంబై-అహ్మదాబాద్ హైస్పీడ్ రైల్ కారిడార్ పనులు ప్రస్తుతం రికార్డు స్థాయిలో శరవేగంగా సాగుతున్నాయి. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తికరమైన అప్‌డేట్ ఇచ్చారు. పనులు ఊహించిన దానికంటే వేగంగా జరుగుతున్నాయని, వచ్చే ఏడాదినాటికి సూరత్ - బిలిమోరా మధ్య మొదటి సెక్షన్‌ను ప్రారంభించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని స్పష్టం చేశారు. అలాగే వాపీ - సూరత్ సెక్షన్ సివిల్ నిర్మాణ పనులను డిసెంబర్ 2026 నాటికి పూర్తి చేయనున్నట్లు తెలిపారు. సుమారు 508 కిలోమీటర్ల పొడవునా విస్తరించి ఉన్న ఈ హైస్పీడ్ కారిడార్‌ను సెప్టెంబర్ 2017లో ప్రారంభించారు. ఇది మహారాష్ట్ర, గుజరాత్, దాద్రా అండ్ నాగర్ హవేలీల గుండా సాగుతుంది.

## టీచర్ పోస్టులపై సుప్రీం కీలక తీర్పు!

- టెట్, నెట్ లేకుంటే టీచర్ ఉద్యోగం లేదు
- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం వద్దు
- అర్హతలేని నియామకాలపై సుప్రీం సీరియస్
- వెనుకదారి నియామకాలకు చెక్
- నాణ్యమైన విద్య ప్రతి పౌరుడి హక్కు
- టీచర్ నియామకాలు పారదర్శకంగానే జరగాలి
- విద్యా ప్రమాణాలు దెబ్బతినకుండా కఠిన ఆదేశాలు


2 లో

## 6 స్థానాలకు బైపోల్స్ డేట్ ఫిక్స్

- అక్టోబర్ 6న పోలింగ్.. 9న కౌంటింగ్
- తమిళనాడులో రెండు స్థానాలకు ఉప ఎన్నిక
- బెంగాల్‌లో రెండు సీట్లకు బైపోల్
- పుదుచ్చేరిలో తట్టాంచవాడికి ఎన్నిక
- అస్సాంలో నాగావ్ లోక్‌సభ స్థానానికి బైపోల్
- సెప్టెంబర్ 9న నోటిఫికేషన్ విడుదల
- రాజీనామాలతో ఖాళీ అయిన ఆరు స్థానాలు

2 లో

## ఈడీలో ఉద్యోగాల జాతర!



న్యూస్ డెస్క్, 08 సెప్టెంబరు (ఇది కద నిజం): కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని రెవెన్యూ విభాగానికి చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) డిప్యుటేషన్ ప్రాతిపదికన పలు కీలక పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తూ అధికారిక సర్క్యులర్ జారీ చేసింది.

## పోలీస్ జాబ్స్‌కు మరో వారం ఛాన్స్!



- సెప్టెంబర్ 16 వరకు దరఖాస్తుల గడువు
- 7,437 పోలీస్ పోస్టులకు భారీ రిక్రూట్‌మెంట్
- అభ్యర్థుల విజ్ఞప్తితో గడువు పొడిగింపు
- కానిస్టేబుల్ నుంచి ఎస్ఐ వరకు పోస్టులు
- ఇంటర్ అర్హతతో కానిస్టేబుల్ పోస్టులకు ఛాన్స్
- ఎస్ఐ, డిప్యూటీ జైలర్‌కు డిగ్రీ తప్పనిసరి
- ప్రిలిమ్స్, ఫిజికల్, రాత పరీక్షలతో ఎంపిక



# సర్కార్ బడుల్లో సరికొత్త జోష్!

న్యూస్ డెస్క్, 08 సెప్టెంబరు (ఇది కద నిజం): తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలలకు సరికొత్త రూపు ఇవ్వడంతో పాటు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల (టీపీఎస్) ఏర్పాటును వేగవంతం చేస్తోంది. అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థలకు దీటుగా టీపీఎస్‌లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా కొత్తగా 73 టీపీఎస్‌ల నిర్మాణానికి తాజాగా పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఈ పాఠశాలల నిర్మాణానికి మొత్తం రూ.699.89 కోట్లను ఖర్చు చేయనున్నారు. ఇందులో రాష్ట్ర బడ్జెట్ నుంచి రూ.209.96 కోట్లు కేటాయించగా.. మరో రూ.489.93 కోట్లను ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబి) రుణంగా సమకూర్చనుంది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి నిర్మాణ ప్రక్రియను వేగంగా చేపట్టాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు, తెలంగాణ విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎండీని ప్రభుత్వం ఆదేశించింది.

మిగతాది 2 లో..

- 73 టీపీఎస్‌లకు గ్రీన్‌సిగ్నల్
- రూ.699.89 కోట్లతో నిర్మాణం
- ఇంటర్నేషనల్ స్కూళ్లకు దీటుగా
- 100 టీపీఎస్‌లే లక్ష్యం
- 1000-1500 మంది విద్యార్థులు
- క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యం
- ల్యాబ్‌లు.. లైబ్రరీలు.. కోర్టులు
- ప్రీప్రైమరీ నుంచి ఇంటర్ వరకు
- సాయంత్రం స్నాక్స్ కూడా..!

## స్పీకర్‌కు సీఎం భరోసా!

- ఘటనపై సీఎంకు ఆవేదన
- బాధ్యులపై చర్యలకు హామీ
- అసెంబ్లీ ఎదుట ఉద్రిక్తత
- నల్ల టీషర్టులతో బీఆర్ఎస్ నిరసన
- సిబ్బందితో తోపులాట
- స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు
- కంటతడి పెట్టిన గడ్డం ప్రసాద్



న్యూస్ డెస్క్, 08 సెప్టెంబరు (ఇది కద నిజం): తెలంగాణ శాసనసభ స్పీకర్ ఛాంబర్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంగళవారం ఉదయం కలిశారు. అసెంబ్లీ సమావేశాల ప్రారంభంలో సోమవారం చోటుచేసుకున్న ఘటనల నేపథ్యంలో సీఎం, డిప్యూటీ సీఎంలు ఆయనను కలిసి పరామర్శించారు. అసెంబ్లీ ఎదుట జరిగిన పరిణామాలపై లోతుగా చర్చించిన ముఖ్యమంత్రి, సోమవారం ఘటనల పట్ల తీవ్ర విచారాన్ని, ఆవేదనను వ్యక్తం చేశారు. స్పీకర్‌ని ఓదార్చిన సీఎం, ప్రభుత్వ పరంగా సంపూర్ణ అండగా ఉంటామని, బాధ్యులపై చట్టపరంగా తగిన చర్యలు పరంగా సంపూర్ణ హామీ ఇచ్చారు.

## కేసీఆర్‌పై హత్యాయత్నం: కేటీఆర్!

- కాంగ్రెస్ గూండాలపై ఆరోపణలు
- పోలీసుల తీరుపై కేటీఆర్ ఫైర్
- బోయిన్‌పల్లి పీఎస్‌కు తరలింపు
- డైవర్షన్ రాజకీయాలంటూ విమర్శ
- హామీల అమలుపై నిలదీత
- దళితబంధుపై రేవంత్‌కు సవాల్
- ప్రజలే తగిన సమాధానం ఇస్తారు



న్యూస్ డెస్క్, 08 సెప్టెంబరు (ఇది కద నిజం): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కాంగ్రెస్ గూండాలు కుట్రపూరితంగా హత్యాయత్నం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ఫాంహౌస్ కు వెళ్తున్న తమను అరెస్ట్ చేసి బోయిన్ పల్లి పీఎస్ కు తరలించగా.. ఆయన మీడియాతో మాట్లాడారు. ఎర్రవల్లి ఫాంహౌస్ ముట్టడి పేరుతో కాంగ్రెస్ శ్రేణులు సాగించిన అరాచకాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. కాంగ్రెస్ గూండాలను కేసీఆర్ నివాస ప్రాంగణం వరకు వెళ్లేందుకు అనుమతించిన పోలీసులు, తమ సొంత ఇంటికి తాము వెళ్తుంటే ఎందుకు అడ్డుకుంటున్నారో రాష్ట్ర డీజీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులు కాంగ్రెస్ అరాచకాలను పట్టించుకోకుండా, కేవలం బీఆర్ఎస్ నాయకులనే లక్ష్యంగా చేసుకుని పనిచేస్తున్నారని మండిపడ్డారు.

2 లో

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
బుధవారం 09-09-2026

# స్పీకర్‌కు సీఎం భరోసా!

మొదటి పేజీ తరువాయి

స్పీకర్‌కు సీఎం కీలక హామీ..

కాగా, సోమవారం అసెంబ్లీ తొలిరోజే ఆవరణలో బీఆర్ఎస్ నాయకులు చేపట్టిన ఆందోళనలు ఉద్రిక్తతకు దారితీశాయి. నల్ల టీ-షర్టులతో నిరసనకు దిగిన బీఆర్ఎస్ నాయకులు హరీష్ రావు, కేటీఆర్ తదితరులు సెక్యూరిటీ సిబ్బంది, అధికారులతో తీవ్ర తోపులాటకు దిగారని, ఈ క్రమంలో కొందరు నాయకులు దుస్తులు తొలగించి అనుచితంగా ప్రవర్తించారని ఆరోపణలు వ్యక్తమయ్యాయి. అంతేకాకుండా, రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిలో ఉన్న గడ్డం ప్రసాద్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ నేతలు అసభ్యకర పదజాలంతో దూషించారని, ఇది మొత్తం తెలంగాణ సమాజానికే అవమానకరమని అధికారపక్షం ఖండించింది. స్పీకర్‌ని వ్యక్తిగతంగా, ఆయన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని చేసిన వ్యాఖ్యలపై తీవ్ర స్థాయిలో చర్చ జరగడంతో స్పీకర్ కంటతడి పెట్టుకున్న దృశ్యాలు మీడియాలో ప్రముఖంగా ప్రసారమయ్యాయి. ఈ దృశ్యాలను చూసి చలించిపోయిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సభ ప్రారంభం కావడానికి ముందే స్పీకర్ ఛాంబర్‌కు వెళ్లేందుకు ప్రాధాన్యతనిచ్చి ఆయన వద్దకు నేరుగా వెళ్లి ఓదార్చారు. స్పీకర్ వ్యవస్థ గౌరవాన్ని కాపాడేందుకు ప్రభుత్వం ఏమాత్రం వెనుకాడదని ఈ సందర్భంగా సీఎం స్పష్టం చేశారు.

# కేసీఆర్‌పై హత్యాయత్నం: కేటీఆర్!

మొదటి పేజీ తరువాయి


డైవర్షన్, డిస్ట్రక్షన్, డిస్ట్రాక్షన్

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ, ప్రతిపక్షాలను వేధించడంలోనే సీఎం రేవంత్ రెడ్డి పైశాచిక ఆనందం పొందుతున్నారని కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వం తన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు డైవర్షన్ రాజకీయాలకు తెరలేపిందని దుయ్యబట్టారు. "డైవర్షన్, డిస్ట్రక్షన్, డిస్ట్రాక్షన్" తప్ప రేవంత్ రెడ్డికి మరొక విద్య తెలియదని.. ఈ ప్రభుత్వం బుద్ధిహీన, సర్వభ్రష్ట ప్రభుత్వమని దుయ్యబట్టారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేంతవరకు బీఆర్ఎస్ వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు.

అసెంబ్లీ సమయంపై సవాల్..

ప్రజాస్వామ్యం ఎన్ని రకాలుగా పరిహాసమవుతుందో తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్‌ను, బీఆర్ఎస్ నేతలను దూషించడానికే సభను వాడుకుంటున్నారని.. దీనికోసం ప్రత్యేకంగా ఒక రోజు కేటాయించుకుని, మిగిలిన వారం రోజులైనా ప్రజా సమస్యలపై మాట్లాడాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దళితులపై నిజంగానే ప్రేమ ఉంటే వెంటనే దళిత, గిరిజన డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దళితబంధు కింద ఒక్కొక్కరికి రూ. 12 లక్షలు ఇస్తామని చెప్పి, కనీసం 12 పైసలు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని, సరైన సమయం వచ్చినప్పుడు ఈ ప్రభుత్వ దుర్మార్గాలకు ప్రజలే తగిన సమాధానం చెప్తారని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

# ఈడీలో ఉద్యోగాల జాతర!




**న్యూస్ డెస్క్, 08 సెప్టెంబరు (ఇది కద నిజం):** కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని రెవెన్యూ విభాగానికి చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) డిప్యుటేషన్ ప్రాతిపదికన పలు కీలక పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తూ అధికారిక సర్క్యులర్ జారీ చేసింది. ఈ నియామక ప్రక్రియ ద్వారా మొత్తం 177 పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిలో పే లెవల్-11 పరిధిలోని 63 డిప్యూటీ డైరెక్టర్ పోస్టులు, అలాగే పే లెవల్-10 పరిధిలోని 114 అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులు ఉన్నాయి. అర్హత ప్రమాణాలు, విద్యార్హతలు, సర్వీస్ నిబంధనలు, దరఖాస్తు నమూనా తదితర సమగ్ర వివరాల కోసం అభ్యర్థులు ఈడీ అధికారిక వెబ్‌సైట్ https://www.enforcementdirectorate.gov.in/others/vacancies/ను సందర్శించాలని నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు.

అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు నిర్దేశిత ఫార్మాట్‌లో పూర్తి చేసిన దరఖాస్తులను, అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రాలతో కలిపి సరైన మార్గం (ప్రాపర్ ఛానల్) ద్వారా న్యూఢిల్లీలోని ఏపీజే అబ్దుల్ కలాం రోడ్డులో ఉన్న ఈడీ జాయింట్ డైరెక్టర్ (ఎస్టాబ్లిష్‌మెంట్) కార్యాలయానికి పంపించాల్సి ఉంటుంది. ఈ వేకెన్సీ సర్క్యులర్ ఆగస్టు 2026 నుంచి జూలై 2027 వరకు అమల్లో ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ఈ వ్యవధిలో స్వీకరించిన దరఖాస్తులను విభాగంలో అవసరాల మేరకు ఖాళీలను భర్తీ చేయడానికి పరిగణనలోకి తీసుకుంటామని ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్ అమన్ మోర్ అధికారిక ప్రకటనలో వెల్లడించారు.

# దామరకుంటలో రచ్చ.. బీఆర్ఎస్ నేతల అరెస్ట్!

**న్యూస్ డెస్క్, 08 సెప్టెంబరు (ఇది కద నిజం):** మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావులతో సహా పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అరెస్ట్ చేశారు. కేటీఆర్ తో పాటు కొందరు ఎమ్మెల్యేలను బోయినపల్లి పోలీస్ స్టేషన్ కు తరలించారు. హరీష్ రావుతో పాటు పలువురు ఎమ్మెల్యేలను జవహర్ నగర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఇదిలా ఉండగా.. నిన్న (సోమవారం) అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనను నిరసిస్తూ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు బయలుదేరారు. దీంతో దామరకుంట దగ్గర ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులను బీఆర్ఎస్ నాయకులు అడ్డుకున్నారు. కాంగ్రెస్ నాయకుల కాన్వాయ్‌పై బీఆర్ఎస్ నాయకులు రాళ్ల దాడికి యత్నించారు. ఇరు వర్గాల మధ్య తోపులాట, తీవ్ర ఘర్షణ చోటు చేసుకున్నాయి. దీంతో అసెంబ్లీ వద్ద నుంచి కేటీఆర్, హరీష్ రావుతో పాటు పలువురు ఎమ్మెల్యేలు కేసీఆర్ ఫామ్ హౌస్‌కు బయలుదేరారు. హకీంపేట వద్ద పోలీసులు వాళ్లను అడ్డుకున్నారు. అక్కడి నుంచి ఎమ్మెల్యేలు, పార్టీ నేతలను కాలినడకన బయలుదేరారు. బొల్లారం వద్ద పోలీసులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. ఎర్రవల్లి వెళ్తున్న తమను ఆపడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బొల్లారం చౌరస్తా నుంచి ఎరవెల్లి వైపు నడుచు కుంటూ వెళ్తుండగా.. పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

# బుల్లెట్ రైలుకు బిగ్ అప్‌డేట్!

మొదటి పేజీ తరువాయి



ప్రయాణికుల సదుపాయం కోసం ఈ మార్గంలో ముంబై, థాణే, విరార్, బోయిసర్, వాపీ, బిలిమోరా, సూరత్, భరూచ్, వడోదర, ఆనంద్, అహ్మదాబాద్, సబర్మతి అనే 12 స్టేషన్లను నిర్మిస్తున్నారు. ఈ స్టేషన్ల డిజైన్లను ఆయా నగరాల స్థానిక సంస్కృతి, గుర్తింపు ప్రతిబింబించేలా, ఆధునిక ఆర్కిటెక్చర్, మల్టీమోడల్ కనెక్టివిటీతో తీర్చిదిద్దుతున్నారు.

ఇక రైలు పట్టాలపైనే కాకుండా, వాహనాల తయారీ పనులు కూడా జోరుగా సాగుతున్నాయి. టెస్టింగ్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన మొదటి కోచ్ ఇప్పటికే సిద్ధమైంది. గంటకు 320 కిలోమీటర్ల గరిష్ట వేగంతో ప్రయాణించే ఈ బుల్లెట్ రైలు అందుబాటులోకి వస్తే, అహ్మదాబాద్ నుంచి ముంబైకి ప్రయాణ సమయం కేవలం 2 గంటల 58 నిమిషాలకు తగ్గిపోతుంది. పూర్తి రక్షణ, మెరుగైన ప్రయాణ అనుభూతిని అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ మార్గాన్ని రూపొందిస్తోంది. తాజా అంచనాల ప్రకారం ఈ కారిడార్‌లో మొదటి పూర్తి స్థాయి బుల్లెట్ రైలు సర్వీస్ ఆగస్టు 2027లో ప్రారంభం కానుంది. మొదటి దశలో భాగంగా వచ్చే ఏడాది సూరత్-బిలిమోరా లైన్, డిసెంబర్ 2026 నాటికి వాపీ-సూరత్ సివిల్ నిర్మాణ లక్ష్యాలు పూర్తయితే భారత రవాణా రంగంలో సరికొత్త అధ్యాయం ప్రారంభమైనట్లే. ఈ మొత్తం 508 కిలోమీటర్ల కారిడార్ పూర్తిస్థాయిలో డిసెంబర్ 2029 నాటికి ప్రజలకు అందుబాటులోకి వస్తుందని రైల్వే మంత్రి తెలిపారు.

# ఏపీ అభివృద్ధికి చంద్రబాబు బిగ్ ప్లాన్!

మొదటి పేజీ తరువాయి

అభివృద్ధి ద్వారా ఓటు బ్యాంకును పెంచుకోవాలని, ఓటు వేసే అలవాటు లేని వారిలోనూ మార్పు తీసుకురావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

డేటా సెంటర్లతో భారీగా ఉద్యోగాలు

రాష్ట్రానికి గూగుల్ వంటి సంస్థలు వచ్చినప్పుడు దేశంలోని ఇతర రాష్ట్రాలు ఆశ్చర్యపోయాయని చంద్రబాబు పేర్కొన్నారు. అయితే రాష్ట్రంలో కొందరు వ్యక్తులు కుట్రలు చేస్తూ పెట్టుబడులను అడ్డుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. డేటా సెంటర్లకు అవసరమైన 5 టీఎంసీల నీరు పెద్ద సమస్య కాదని చెప్పారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా రోజుకు దాదాపు 2 టీఎంసీల నీటిని తరలించే అవకాశం ఉందన్నారు. డేటా సెంటర్ల ఏర్పాటుతో భారీ మొత్తంలో ఉద్యోగాలు, లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చంద్రబాబు తెలిపారు. పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయవచ్చని అన్నారు.

రూ.20.35 లక్షల కోట్ల జీఎస్డీపీ

2026-27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర జీఎస్డీపీ రూ.20.35 లక్షల కోట్లుగా ఉందని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గం ఆర్థికంగా ఎదిగేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధి ద్వారా రాష్ట్రవ్యాప్తంగా విజయగాథలను సృష్టించుకోవాలని సూచించారు.

నీటి వనరుల వినియోగంపై ప్రత్యేక దృష్టి

ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ ఈ ఏడాది గోదావరి నుంచి సుమారు 1,000 టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్లిందని చంద్రబాబు తెలిపారు. అందులో కనీసం 300 టీఎంసీలను వినియోగించుకున్నా రాష్ట్ర పరిస్థితుల్లో గణనీయమైన మార్పు తీసుకురావచ్చని అన్నారు. మూడేళ్లలో రూ.35 వేల కోట్లతో రాష్ట్రంలోని 36 ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ప్రకటించారు. పుష్కరాలకంటే ముందే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. వంశధార, గోదావరి, కృష్ణా, తుంగభద్ర, కావేరి, పెన్నా నదులను అనుసంధానం చేస్తే రాష్ట్రంలోని అన్ని రిజర్వాయర్లను నింపుకునే అవకాశం ఉంటుందని వివరించారు.

ప్రాజెక్టులు పూర్తయితే 1,400 టీఎంసీల నిల్వ

వెలిగొండలో ఈ సీజన్‌లో 10.7 టీఎంసీల నీటిని నిల్వ చేస్తున్నామని, వచ్చే ఏడాది 50 టీఎంసీల వరకు నిల్వ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చంద్రబాబు తెలిపారు. పోలవరం ఫేజ్-2 పూర్తయితే 190 టీఎంసీల వరకు నీటిని నిల్వ చేసుకోవచ్చని, బొల్లాపల్లి ప్రాజెక్టు నిర్మిస్తే ఈ సామర్థ్యం 350 టీఎంసీలకు చేరుతుందని చెప్పారు. కడప జిల్లాలోని ప్రాజెక్టులతో దాదాపు 100 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉందన్నారు. నెల్లూరు జిల్లాలో సోమశిల, కండలేరు జలాశయాలు ఉన్నాయని గుర్తుచేశారు. అన్ని ప్రాజెక్టులు పూర్తయితే రాష్ట్రంలోని రిజర్వాయర్లలో 1,250 నుంచి 1,400 టీఎంసీల నీటిని నిల్వ చేసుకోవచ్చని, ఇది రాష్ట్ర చరిత్రను మార్చే స్థాయిలో ఉంటుందని చంద్రబాబు పేర్కొన్నారు.

భూగర్భ జలాల పెంపుపైనా దృష్టి

నదుల ద్వారా బయట నుంచి నీటిని తీసుకురావడం ఎంత ముఖ్యమో.. రాష్ట్రంలో కురిసే వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మార్చడం కూడా అంతే ముఖ్యమని చంద్రబాబు అన్నారు. భూగర్భ జలాలు పెరిగితే వ్యవసాయానికి విద్యుత్‌పై ప్రభుత్వం చేసే సబ్సిడీ వ్యయం తగ్గుతుందని, ట్రాన్స్‌మిషన్ ఖర్చులు కూడా తగ్గుతాయని వివరించారు.

మౌలిక వసతులపై ప్రత్యేక ప్రణాళిక

గత 30 ఏళ్లలో దేశంలో ఊహించని స్థాయిలో మార్పులు వచ్చాయని చంద్రబాబు అన్నారు. దేశంలోనే అత్యంత సౌకర్యవంతమైన హైవేలు రాష్ట్రంలో నిర్మిస్తున్నామని, పోర్టులు, ఎయిర్‌పోర్టులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మైక్రో ఇరిగేషన్‌ను తీసుకొచ్చింది కూడా తమ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. వెల్త్ క్రియేట్ చేయడానికి డబ్బులు లేవని కూర్చుంటే సరిపోదని.. ఆలోచన చేస్తే పరిష్కారం లభిస్తుందని చంద్రబాబు అన్నారు. దేశంలోనే నంబర్-1 డెవలపర్‌గా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. సాస్కి, ప్రభుత్వ నిధులు, నాబార్డ్ వంటి వనరుల నుంచి వచ్చే నిధులను సమర్థంగా వినియోగించేందుకు ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు తెలిపారు.

కుప్పం తరహాలో రాష్ట్రవ్యాప్తంగా సక్సెస్ స్టోరీలు

కుప్పం సమీపంలో జాతీయ రహదారికి దగ్గరగా పారిశ్రామిక ప్రాంతాన్ని ఏర్పాటు చేసి రూ.30 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని చంద్రబాబు తెలిపారు. ఇదే తరహాలో రాష్ట్రవ్యాప్తంగా విజయగాథలను సృష్టించాలని అన్నారు. 'వన్ ఫ్యామిలీ.. వన్ ఎంట్రప్రెన్యూర్' విధానాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తే అభివృద్ధి మరింత వేగంగా సాధ్యమవుతుందని చెప్పారు. అవకాశాలను అందిపుచ్చుకునేలా ప్రజల ఆలోచనా విధానం మారాలని, అందుకు అనుగుణంగా పబ్లిక్ పాలసీలను రూపొందించాలని సూచించారు.

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై ఫోకస్

రాష్ట్రంలో పెట్టుబడులు, పరిశ్రమలు వేగంగా ఏర్పాటయ్యేలా 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'ను మరింత మెరుగుపరచాలని చంద్రబాబు అన్నారు. ప్రజలకు ఇబ్బందిగా ఉన్న అంశాలను నాయకులు గుర్తించి, వాటికి తగిన పరిష్కారాలను సూచించాలని సూచించారు. ప్రతి ప్రాంతంలోని అవకాశాలను గుర్తించి, వాటిని అభివృద్ధిగా మార్చగలిగితే రాష్ట్రాన్ని వేగంగా ముందుకు తీసుకెళ్లవచ్చని ఆయన పేర్కొన్నారు టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు..

# పోలీస్ జాబ్స్‌కు మరో వారం ఛాన్స్!



**న్యూస్ డెస్క్, 08 సెప్టెంబరు (ఇది కద నిజం):** తెలంగాణలో పోలీస్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు పోలీసు నియామక మండలి శుభవార్త చెప్పింది. అభ్యర్థులు సెప్టెంబర్ 16వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. పోలీస్ శాఖలో 7,437 పోస్టులకు జూలై 29న ప్రభుత్వం 4 నోటిఫికేషన్లను విడుదల చేసింది. ఈ పోస్టులకు సెప్టెంబర్ 9వ తేదీతో గడువు ముగియనుండగా.. ఈ గడువును మరో వారంరోజులపాటు పొడిగిస్తున్నట్లు పోలీసు నియామక మండలి ప్రకటించింది. అభ్యర్థుల విజ్ఞప్తుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

తెలంగాణ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు భారీగా ఉద్యోగాల రిక్రూట్మెంట్ ను ప్రకటించింది. సివిల్, ఏఆర్, టీఎస్ఎస్పీ విభాగాలతో పాటు ఇతర విభాగాల్లోనూ రిక్రూట్మెంట్ (https://www.tgprb.in) చేపట్టింది. వీటిలో కానిస్టేబుల్, ఫైర్ ఫైటర్, వార్డర్ పోస్టులకు అప్లై చేసుకునేవారికి ఇంటర్మీడియట్ లేదా తత్సమాన కోర్సులో ఉత్తీర్ణులై ఉండాలి. అలాగే ఎస్సై, డిప్యూటీ జైలర్ పోస్టులకు ఏదైనా డిగ్రీ, టెక్నికల్ పోస్టులకు టెన్త్, ఐటీఐ తో పాటు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి. ప్రిలిమినరీ పరీక్ష, శరీర దారుఢ్యం, రాత పరీక్షల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

# టీచర్ పోస్టులపై సుప్రీం కీలక తీర్పు!

**న్యూస్ డెస్క్, 08 సెప్టెంబరు (ఇది కద నిజం):** దేశంలో ఉపాధ్యాయుల నియామకాలు, సర్దుబాటు ప్రక్రియపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సంచలన తీర్పును వెలువరించింది. అర్హత లేని వ్యక్తులను స్కూళ్లు, కాలేజీల్లో టీచర్లు, ట్యూటర్లుగా నియమించడాన్ని ధర్మాసనం తీవ్రంగా తప్పుబట్టింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మల్య బాగ్చి, జస్టిస్ మోహనాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. విద్యా హక్కు చట్టం, నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిబంధనల ప్రకారం నిర్దేశిత కనీస అర్హతలు, టెట్, నెట్ లాంటి అర్హత పరీక్షలు పాస్ కాని వారిని ఏ విద్యా సంస్థలోనూ ఉపాధ్యాయులుగా నియమించడానికి వీలేదని స్పష్టం చేసింది.

విచారణ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ.. అర్హత లేని వ్యక్తులను ఉపాధ్యాయులుగా ఎందుకు నియమిస్తున్నారు? ఇది భావి తరాల భవిష్యత్తును పూర్తిగా నాశనం చేస్తుందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సరైన అర్హతలు, పారదర్శకమైన పోటీ పరీక్షల ప్రక్రియ లేకుండా వెనుకదారులు పట్టి ప్రభుత్వ ఉద్యోగాల్లోకి, సబ్సిడరీ వ్యవస్థల్లోకి ఉపాధ్యాయులను తీసుకోవడాన్ని కోర్టు తప్పుబట్టింది. రాజ్యాంగం కల్పించిన అధికరణం 21-ఏ ప్రకారం నాణ్యమైన విద్య ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని కోర్టు గుర్తుచేసింది. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ఇష్టానుసారం నియామకాలు చేపడితే దేశ విద్యా ప్రమాణాలు తీవ్రంగా దెబ్బతింటాయని అభిప్రాయపడింది. భవిష్యత్తులో అన్ని ప్రభుత్వ నియామకాలు పూర్తిగా పారదర్శకంగా, నిబంధనలకు లోబడి మాత్రమే జరగాలని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది.

# 'డీఎస్సీ అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి'



**న్యూస్ డెస్క్, 08 సెప్టెంబరు (ఇది కద నిజం):** ఏపీలో డీఎస్సీ నిర్వహణ తీవ్ర కుంభకోణంగా మారిందని, రాష్ట్రవ్యాప్తంగా ఇది పెద్ద చర్చనీయాంశమైందని వైసీపీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ధ్వజమెత్తారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఎస్సీలో అంతులేని అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయని, దేశ చరిత్రలోనే ఇంతటి పెద్ద స్కామ్ మరొకటి జరగలేదని ఆరోపించారు. మెగా డీఎస్సీ పేరుతో టీచర్ ఉద్యోగాలను మార్కెట్‌లో అమ్మకానికి పెట్టారని, అడ్డదారిలో ఉద్యోగాలు ఎలా వచ్చాయో ఆధారాలతో సహా బయటపడుతోందని విమర్శించారు.

ఈ మొత్తం వ్యవహారానికి కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం వహించింది విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అని సజ్జల ఆరోపించారు. డీఎస్సీ అక్రమాలపై తాము నిలదీస్తే ప్రభుత్వం బుకాయిస్తూ, ఎదురుదాడికి దిగుతోందని మండిపడ్డారు. మొదట్లో ఏమీ జరగలేదని బుకాయించిన వారు, ఆ తర్వాత ఒకటి రెండు తప్పులు జరిగి ఉంటాయని ఒప్పుకునే పరిస్థితికి వచ్చారని ఎద్దేవా చేశారు. ఈ వ్యవహారంపై మాట్లాడటానికి తండ్రీకొడుకులు (చంద్రబాబు, లోకేష్) ముందడుగు వేయకుండా, మహిళా అధికారులను ముందుంచి మాట్లాడిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు సైతం వారు ముందే సిద్ధం చేసుకున్న సమాధానాలు మాత్రమే చెప్తున్నారని పేర్కొన్నారు.

ఇది సాధారణ రిక్రూట్‌మెంట్ కాదని, "క్యాష్ ఫర్ టీచర్ పోస్ట్" అని సజ్జల అభివర్ణించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేసి, అక్రమాలకు తెరలేపారని విమర్శించారు. ప్రభుత్వం తప్పులను కవరప్ చేసేందుకు రకరకాల మలుపులు తిప్పుతోందని, పొరపాట్లు ఉంటే పరిష్కరిస్తామని చెప్పడం సరికాదన్నారు. ఈ స్కామ్ చిన్నది కాదని, తప్పు చేసిన వారు కూడా చిన్నవారు కాదని స్పష్టం చేశారు. ఈ అక్రమాలకు పూర్తి బాధ్యత వహిస్తూ మంత్రి లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని, ఈ అంశంపై తమ పార్టీ పోరాటం కొనసాగుతుందని సజ్జల స్పష్టం చేశారు.

# 6 స్థానాలకు బైపోల్స్ డేట్ ఫిక్స్



**న్యూస్ డెస్క్, 08 సెప్టెంబరు (ఇది కద నిజం):** దేశవ్యాప్తంగా ఆరు స్థానాలకు జరిగే ఉప ఎన్నికల తేదీలను ఎన్నికల సంఘం ప్రకటించింది. నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలోని ఐదు అసెంబ్లీ స్థానాలకు, ఒక లోక్‌సభ స్థానానికి 2026 అక్టోబర్ 6న పోలింగ్ జరగనుండగా.. అక్టోబర్ 9న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఎమ్మెల్యేలు, ఎంపీల రాజీనామాల కారణంగా ఈ స్థానాలన్నీ ఖాళీ అయ్యాయి.

ఈ స్థానాల్లో ఉప ఎన్నికలు
మదురాంతకం (తమిళనాడు)
ధారపురం (తమిళనాడు)
తట్టంచవాడి (పుదుచ్చేరి)
రాజ్‌నగర్ (పశ్చిమ బెంగాల్)
నందిగ్రామ్ (పశ్చిమ బెంగాల్)
లోక్‌సభ స్థానం: నాగావ్ (అస్సాం)

ఉప ఎన్నికల పూర్తి షెడ్యూల్
నోటిఫికేషన్ విడుదల తేదీ: 09 సెప్టెంబర్ 2026
నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ: సెప్టెంబర్ 16, 2026
నామినేషన్ పత్రాల పరిశీలన: సెప్టెంబర్ 17, 2026
ఉపసంహరించుకోవడానికి చివరి తేదీ: సెప్టెంబర్ 19, 2026
ఎన్నికల తేదీ: 06 అక్టోబర్ 2026
లెక్కింపు తేదీ: అక్టోబర్ 9, 2026
ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే తేదీ: అక్టోబర్ 11, 2026

ఉప ఎన్నికలు ఎందుకు?

ప్రజాప్రతినిధుల రాజీనామాల కారణంగా ఆరు స్థానాలకు ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. నాగావ్ లోక్‌సభ స్థానం నుంచి పార్లమెంట్ సభ్యుడు ప్రద్యుత్ బోర్డోలోయ్ రాజీనామా చేయడంతో అస్సాంలో ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. మరో ఐదు అసెంబ్లీ స్థానాల నుంచి కూడా ఎమ్మెల్యేలు రాజీనామా చేశారు. తమిళనాడులోని మదురాంతకం స్థానం నుంచి ఎమ్మెల్యే మరగాతం కుమారవేల్, ధారపురం నుంచి పి. సత్యభామ రాజీనామా చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని రేజినగర్ నుంచి ఎమ్మెల్యే హుమాయున్ కబీర్, నందిగ్రామ్ నుంచి గుజరాత్ సీఎం సువేందు అధికారి రాజీనామా చేశారు. ఇది కాకుండా పుదుచ్చేరిలోని తట్టంచవాడి స్థానం నుంచి ఎమ్మెల్యే ఎన్. రంగస్వామి రాజీనామా చేశారు. దీంత ఉప ఎన్నిక అనివార్యమైంది.

# సర్కార్ బడుల్లో సరికొత్త జోష్!

మొదటి పేజీ తరువాయి



ఈ నెలలోనే నిర్మాణ పనులకు టెండర్లు పిలవనున్నట్లు టీజీఈడబ్ల్యూఐడీసీ ఎండీ గణపతిరెడ్డి తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా 100 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి గత ఫిబ్రవరిలో నిర్ణయించారు. ఇప్పటికే ఇబ్రహీంపట్నం, అచ్చంపేట నియోజకవర్గాల్లో రెండేసి చొప్పున, గజ్వేల్‌లో ఒక టీపీఎస్‌కు అనుమతులు లభించాయి. ఇబ్రహీంపట్నం పరిధిలోని ఆరుట్ల టీపీఎస్ ఇప్పటికే ప్రారంభమైంది. మిగిలిన పాఠశాలల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. తాజాగా ప్రతిపాదించిన 95 పాఠశాలల్లో 73కి ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో.. ఇప్పటివరకు మంజూరైన టీపీఎస్‌ల సంఖ్య 78కు చేరింది. మిగిలిన పాఠశాలలపై కూడా త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు భిన్నంగా టీపీఎస్‌లు సెమీ రెసిడెన్షియల్ విధానంలో పనిచేయనున్నాయి. ఇప్పటికే ఉన్న ప్రభుత్వ పాఠశాలలను కూడా అవసరమైన మౌలిక వసతులతో టీపీఎస్‌లుగా తీర్చిదిద్దనున్నారు. సాధారణంగా కనీసం రెండు నుంచి మూడు ఎకరాల స్థలం ఉన్న పాఠశాలలను ఎంపిక చేసి.. వాటి పరిధిలోని సమీపంలోని మరో రెండు, మూడు పాఠశాలలను విలీనం చేసే విధానాన్ని అనుసరించనున్నారు. అవకాశం ఉన్న ప్రాంతాల్లో సమీపంలోని జూనియర్ కళాశాలలను కూడా ఈ సముదాయాల్లోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది.

టీపీఎస్‌లలో విద్యార్థులకు తరగతి గదులతో పాటు క్రీడా మైదానాలు, బాస్కెట్‌బాల్, వాలీబాల్ కోర్టులు, గ్రంథాలయాలు, కంప్యూటర్-సైన్స్ ల్యాబ్‌లు, ప్రీప్రైమరీ విద్యార్థుల కోసం ప్రత్యేక ఆట స్థలాలు వంటి సౌకర్యాలు కల్పించనున్నారు. ప్రీప్రైమరీ నుంచి పదో తరగతి లేదా ఇంటర్మీడియట్ వరకు నాణ్యమైన విద్యను ఒకే క్యాంపస్‌లో అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. పాఠశాలల విలీనం ద్వారా ఒక్కో టీపీఎస్‌లో విద్యార్థుల సంఖ్య కనీసం 1000 నుంచి 1500 వరకు ఉండేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఒకే ప్రాంగణంలో చదవడం ద్వారా మెరుగైన విద్యా వాతావరణం ఏర్పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అదే సమయంలో ఉపాధ్యాయుల సంఖ్య పెరగడం, వనరులను సమర్థంగా వినియోగించడం వంటి ప్రయోజనాలు కూడా ఉంటాయని అధికారులు చెబుతున్నారు.

సాధారణ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందుతున్న నేపథ్యంలో.. టీపీఎస్‌లలో సాయంత్రం కూడా అల్పాహారం అందించే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోంది. విద్యతో పాటు క్రీడలు, సాంకేతిక నైపుణ్యాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచడమే టీపీఎస్‌ల ప్రధాన ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు.

# ముఖ్యమంత్రే గూండాగిరిని ప్రోత్సహిస్తే శాంతిభద్రతలు ఏం కావాలి?

- ప్రత్యర్థిని రాజకీయంగా ఢీకొట్టాలే తప్ప చావుకోరుకోవడం ఏమిటి
- షాద్ నగర్ ఎమ్మెల్యే దూషణలను కాంగ్రెస్ పార్టీ ఎందుకు ఉపేక్షిస్తోంది
- రాజకీయాలు మానేసి ఇకనైనా అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించండి
- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షులు కల్వకుంట్ల కవిత

ఇది కద నిజం ,హైదరాబాద్ :

రాష్ట్ర ముఖ్యమంత్రే సొంత పార్టీ నేతలను ఉసిగొల్పి గూండాగిరిని ప్రోత్సహించడం ఏమిటని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షులు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. రాష్ట్రంలో జరుగుతోన్న రాజకీయ పరిణామాలపై మంగళవారం ఆమె "ఎక్స్" వేదికగా స్పందించారు. రాజకీయ ప్రత్యర్థులను రాజకీయంగా ఢీకొట్టాలే తప్ప చావు కోరుకోవడం ఏమిటని నిలదీశారు. షాద్ నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తన నోటి దురుసుతో ప్రత్యర్థి నాయకులను, కులాలను, వ్యవస్థలను దూషించడం, దుర్భాషలాడటం ఇదే మొదటిసారి కాదని, అలాంటి నాయకుడిపై కాంగ్రెస్ పార్టీ ఎందుకు క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఆయన దూషణలను కాంగ్రెస్ పార్టీ సమర్థిస్తుందా అని నిలదీశారు. ప్రతిపక్ష నాయకుడి ఇంటిపైకి అధికార పార్టీ నాయకులు దండయాత్రకు వెళ్లడం ఏమిటీ.. ఒక ముఖ్యమంత్రే తన పార్టీ నాయకులను ఇలాంటి దాడికి ఉసిగొల్పడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ ఏం పని చేస్తోందో లేదో అర్థం కావడం లేదన్నారు.

రాష్ట్ర ప్రజలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతుంటే అధికార పార్టీ, ప్రధాన ప్రతిపక్షం వాటిని పట్టించుకోకుండా అసెంబ్లీ వేదికగా రాజకీయాలు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీ రీయింబర్స్ మెంట్ బకాయిలు అందక విద్యార్థులు, 22ఏ నిషేధిత భూముల జాబితాలో తమ భూములు నమోదు అయి రైతులు, సామాన్య ప్రజలు.. ఉద్యోగ నోటిఫికేషన్లు రాక, జాబ్ క్యాలెండర్ ప్రకటించకపోవడంతో నిరుద్యోగులు, యూరియా దొరకక రైతులు, జీవో 97ను రద్దు చేయాలని పాలిటెక్నిక్ విద్యార్థులు, వరుసగా జరుగుతోన్న అఘాయిత్యాలు, హత్యాచారాలతో భయం భయంగా మహిళలు.. నాణ్యమైన భోజనం, వసతులు లేక అనేక సమస్యల్లో గురుకులాల విద్యార్థులు.. పీఆర్సీ అమలు, పెండింగ్ డీఏలు సహా తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు సహా అన్ని వర్గాల ప్రజలు తీవ్రమైన ఆందోళనలో ఉంటే అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు రెండు రోజులుగా విలువైన సభా సమయాన్ని వృథా చేశాయన్నారు. రేపటి నుంచి అయినా అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చ జరగాలని వాటికి పరిష్కారం చూపించే దిశగా చర్చించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు.

**ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల వయోపరిమితిని వెంటనే పెంచాలి**

ఎంతో కాలంగా పోలీస్ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులను దృష్టిలో ఉంచుకుని ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల వయోపరిమితిని పెంచాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఎస్సై ఉద్యోగాలకు 38 ఏళ్లు, కానిస్టేబుల్ ఉద్యోగాలకు 36 ఏళ్ల వరకు వయోపరిమితి ఉండాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. వయో పరిమితి పెంచకుండా ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వటంతో ఎంతో మంది నిరుద్యోగులకు నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ జిల్లాలకు చెందిన నిరుద్యోగ అభ్యర్థుల తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో మంగళవారం కవిత ను కలిశారు. వయో పరిమితి పెంచకపోవటం కారణంగా ఎంతోమంది విద్యార్థులు పోలీస్ ఉద్యోగాలకు అర్హత పొందలేకపోతున్నారని కవిత కు వివరించారు. కచ్చితంగా ఈ విషయంలో అండగా ఉంటామంటూ కవిత వారందరికీ హామీ ఇచ్చారు. నిరుద్యోగుల కష్టంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ వారిని మోసం చేస్తే తప్పకుండా మూల్యం చెల్లించుకుంటుందన్నారు.




**వయో పరిమితి పెంచి నోటిఫికేషన్ ఇవ్వాలి**

ఎస్సై, కానిస్టేబుల్ జాబ్స్ కు వయోపరిమితి కచ్చితంగా పెంచాల్సిందేనని రేవంత్ సర్కార్ ను కవిత డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావటానికి నిరుద్యోగులే కారణమని ఆమె గుర్తు చేశారు. కాంగ్రెస్ కార్యకర్తల కన్నా ఎక్కువగా నిరుద్యోగులే కాంగ్రెస్ పార్టీని గద్దెనెక్కించేందుకు కష్టపడ్డారన్నారు. అలాంటి నిరుద్యోగులను రేవంత్ రెడ్డి సర్కార్ నిండా ముంచిందని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్న సరైన నోటిఫికేషన్లు లేవంటూ విమర్శించారు. 2024 లో కానిస్టేబుల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తున్నట్లే చేసి జీవో నంబర్ 31 తీసుకొచ్చారని గుర్తు చేశారు. అప్పుడు 2 ఏళ్ల వయోపరిమితి పెంచుతామని చెప్పినప్పటికీ వెంటనే ఉద్యోగాలకు నోటిఫికేషన్ వేయకుండా మరో రెండేళ్లు తాత్సారం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన తాత్సారం కారణంగా ఇప్పుడు వేస్తున్న నోటిఫికేషన్ కు నాలుగేళ్ల వయోపరిమితి పెంచాల్సిన అవసరముందని అన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నంబర్ 31 లో ఇచ్చిన రెండేళ్ల వయోపరిమితిని కూడా తీసేయటంతో ఇప్పుడు లక్షలాది మంది అభ్యర్థులు అర్హత కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వయోపరిమితి పెంచకపోవటం కారణంగా దాదాపు 3 లక్షల మంది అభ్యర్థులు ఉద్యోగాలకు అప్లయ్ చేసుకోలేదన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం సీరియస్ గా తీసుకోని ఎస్సై ఉద్యోగాలకు 38, కానిస్టేబుల్ ఉద్యోగాలకు 36 ఏళ్ల వయో పరిమితి ఇవ్వాలన్నారు.

**20 వేల కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేయాలి**

పోలీస్ ఉద్యోగాల భర్తీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తోందన్నారు. మొత్తం 20 వేల పోలీసు ఉద్యోగాలు ఖాళీగా ఉంటే కేవలం 7 వేల పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చారని విమర్శించారు. మొత్తం 20 వేల పోస్టులను భర్తీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ ద్వారా జిల్లా కు 2 వందల పోస్టులు కూడా లేని పరిస్థితి ఉందన్నారు. లక్షలాది మంది నిరుద్యోగులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుంటే జిల్లాకు 2 వందల పోస్టులు ఏమూలకు సరిపోతాయని ప్రశ్నించారు. వెంటనే 20 వేల పోస్టులను భర్తీ చేయాలన్నారు. పోలీస్ ఉద్యోగాల విషయంలో హోంశాఖ ఒకటి చెబుతుంటే ప్రభుత్వం మరొకటి చెబుతోందని కవిత మండిపడ్డారు. అధికారంలోకి వచ్చి మూడేళ్లుగా నిరుద్యోగులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా 20 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చి కొంతైనా వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల తరపున నిరంతరం తెలంగాణ రక్షణ సేన పోరాటం చేస్తుందన్నారు.

# దళితుడు స్పీకర్ అయిండు...
# స్పీకర్ దళితుడు కాదు

- స్పీకర్‌ను రాజకీయ వివాదంలోకి లాగడం సరికాదు
- ప్రజా సమస్యలను పక్కదారి పట్టించే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారు
- స్పీకర్--సభ్యుడి సంబంధాన్ని వ్యక్తిగత, రాజకీయ వివాదంగా మార్చొద్దు
- "దళితుడు" అనే గుర్తింపును పదేపదే ప్రస్తావించడం ప్రసాద్ ని అవమానించడమే - కాసాని శ్రీనివాసరావు గౌడ

ఇది కద నిజం,హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం కొనసాగుతున్న పరిణామాలు ప్రజా సమస్యల పరిష్కారం కంటే వ్యక్తిగత, రాజకీయ ఆధిపత్య పోరాటంగా మారుతున్నాయనే భావన ప్రజల్లో వ్యక్తమవుతోందని జై స్వరాజ్ పార్టీ జాతీయ అధ్యక్షులు శ్రీ రాజయోగి కాసాని శ్రీనివాసరావు గౌడ అన్నారు.

రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి, కేసీఆర్ నాయకత్వంలోని ప్రతిపక్షానికి మధ్య నెలకొన్న రాజకీయ ఘర్షణల నేపథ్యంలో ఒక సంఘటనను విస్తృత రాజకీయ వివాదంగా మార్చడం ద్వారా అసలు ప్రజా సమస్యలు పక్కదారి పట్టే పరిస్థితి ఏర్పడుతోందని ఆయన విమర్శించారు.

"ఇది ప్రజల సమస్యల కోసం జరుగుతున్న పోరాటంగా కనిపించడం లేదు. ఒకవైపు రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై రాజకీయ విమర్శలు, మరోవైపు కేసీఆర్ నాయకత్వంలోని ప్రతిపక్ష రాజకీయాలు---ఈ రెండింటి మధ్య జరుగుతున్న రాజకీయ తతంగంగా ప్రజలకు కనిపిస్తోంది. కానీ తెలంగాణ ప్రజలకు కావాల్సింది రాజకీయ రచ్చ కాదు; పాలన, ఉపాధి, రైతు సంక్షేమం, విద్య, వైద్యం, యువత భవిష్యత్తుపై సమాధానాలు" అని కాసాని శ్రీనివాసరావు గౌడ అన్నారు.

**స్పీకర్ పదవిని రాజకీయ వివాదంలోకి లాగొద్దు**

శాసనసభ స్పీకర్ పదవి రాజ్యాంగబద్ధమైన, అత్యంత గౌరవప్రదమైన పదవి. స్పీకర్‌ను ఒక పార్టీకి చెందిన రాజకీయ నాయకుడిగా మాత్రమే చూడటం ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదని ఆయన అన్నారు.

స్పీకర్--శాసనసభ్యుడి మధ్య ఉన్న సంబంధాన్ని స్పీకర్ పదవి, సభా నియమావళి, రాజ్యాంగ బాధ్యతల కోణంలోనే చూడాలి. వ్యక్తిగత సంఘటనలను ఆధారంగా చేసుకుని స్పీకర్ పదవినే అవమానించే విధంగా రాజకీయ వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య సంప్రదాయాలకు విరుద్ధమని అన్నారు.ఒక శాసనసభ్యుడి వ్యక్తిగత ప్రవర్తన, ఒక రాజకీయ పార్టీ వైఖరి, స్పీకర్‌గా ఆయన నిర్వహించాల్సిన బాధ్యత--- ఈ మూడు అంశాలను కలగలపడం సరికాదని స్పష్టం చేశారు.

"దళితుడు" అనే గుర్తింపుతోనే పదేపదే ప్రస్తావించడం ఎందుకు?

ప్రసాద్ గారిని కాంగ్రెస్ పార్టీ పదేపదే "దళితుడు" అనే గుర్తింపుతో ప్రస్తావిస్తూ రాజకీయంగా సమర్థించుకోవడం కూడా ప్రశ్నార్థకమేనని కాసాని శ్రీనివాసరావు గౌడ అన్నారు.

"ఒక వ్యక్తి సామర్థ్యం, వ్యక్తిత్వం, ప్రజాప్రతినిధిగా ఆయన చేసిన పని ఆధారంగా మాట్లాడాలి. ఒక నాయకుడిని కేవలం ఆయన కులం లేదా సామాజిక గుర్తింపుతో పదేపదే ప్రస్తావించడం ద్వారా రక్షించాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? అదే సమయంలో 'దళితుడు' అనే పదాన్ని రాజకీయ కవచంగా ఉపయోగించడం ద్వారా ఆయనను మరింత ఒక కుల గుర్తింపుకే పరిమితం చేస్తున్నారనే విషయాన్ని కాంగ్రెస్ గ్రహించాలి" అని అన్నారు.

సామాజిక న్యాయం అంటే ఒక వ్యక్తిని కేవలం కుల గుర్తింపుతో రాజకీయంగా ఉపయోగించుకోవడం కాదని, ప్రతి పౌరుడికి సమాన గౌరవం, సమాన అవకాశాలు, సమాన న్యాయం కల్పించడమే నిజమైన సామాజిక న్యాయమని పేర్కొన్నారు.

**అసెంబ్లీ వెలుపల జరిగిన సంఘటనపై స్పష్టత అవసరం**

సంఘటన శాసనసభ ప్రాంగణం లేదా సభా కార్యకలాపాల వెలుపల జరిగి ఉంటే, దానిని నేరుగా శాసనసభ వ్యవహారాలతో లేదా స్పీకర్ అధికార పరిధితో ముడిపెట్టడం ఎంతవరకు సమంజసమో ప్రభుత్వం, రాజకీయ పార్టీలు ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కాసాని శ్రీనివాసరావు గౌడ కోరారు.

"సభ లోపల జరిగే వ్యవహారాలు, సభా హక్కులు, సభా నియమాలు, సభ్యుల ప్రవర్తన వంటి అంశాలకు స్పీకర్‌కు ఉన్న రాజ్యాంగబద్ధమైన పరిధి ఒకటి. సభ వెలుపల జరిగిన వ్యక్తిగత లేదా శాంతిభద్రతలకు సంబంధించిన సంఘటనలకు సంబంధిత చట్టపరమైన వ్యవస్థ, పోలీసు మరియు హోం శాఖ పరిధి మరోటి. ఈ రెండు పరిధులను కలిపి చూడటం వల్లే అనవసరమైన రాజకీయ వివాదం ఏర్పడుతోంది" అని ఆయన అన్నారు.

అయితే సంఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలు, వీడియోలు, సాక్ష్యాలు, చట్టపరమైన అంశాలు పరిశీలించిన తర్వాతే బాధ్యత ఎవరిది అనే విషయంపై తుది నిర్ణయం తీసుకోవాలని ఆయన సూచించారు.

**ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించొద్దు**

తెలంగాణలో నిరుద్యోగం, రైతుల ఆర్థిక ఇబ్బందులు, యువతకు ఉపాధి, విద్యార్థుల సమస్యలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, మహిళల ఆర్థిక భద్రత, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, ప్రభుత్వ ఉద్యోగాలు, చిన్న వ్యాపారాల సంక్షోభం వంటి అనేక సమస్యలు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు.

"ప్రజలు ఓట్లు వేసింది నాయకులు ఒకరినొకరు తిట్టుకోవడానికి కాదు. తమ జీవితాలను మెరుగుపరచడానికి. అసెంబ్లీ బయట జరిగిన ఒక సంఘటనను రోజుల తరబడి రాజకీయ యుద్ధంగా మార్చి ప్రజా సమస్యలను మరుగున పడేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు" అని అన్నారు.

రేవంత్ రెడ్డి ప్రభుత్వం అయినా, కేసీఆర్ నాయకత్వంలోని ప్రతిపక్షం అయినా ప్రజల ముందుకు వచ్చి ఉద్యోగాలు ఎప్పుడు? రైతు ఆదాయం ఎలా పెంచుతారు? యువతకు ఉపాధి ఎలా కల్పిస్తారు? గ్రామాల ఆర్థిక వ్యవస్థను ఎలా బలోపేతం చేస్తారు? విద్య, వైద్య రంగాలను ఎలా మెరుగుపరుస్తారు? అనే ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని డిమాండ్ చేశారు.

**రాజకీయ రచ్చ కాదు -- ప్రజా రాజ్యం కావాలి**

తెలంగాణలో ప్రజలు కొత్త రాజకీయ సంస్కృతిని కోరుకుంటున్నారని, వ్యక్తిగత ఆరోపణలు, పరస్పర దూషణలు, కుల గుర్తింపుల రాజకీయాల కంటే విధానాలు, అభివృద్ధి, బాధ్యతాయుతమైన పాలన ప్రధానంగా ఉండాలని జై స్వరాజ్ పార్టీ జాతీయ అధ్యక్షులు కాసాని శ్రీనివాసరావు గౌడ అన్నారు.

"ప్రజల దృష్టిని మళ్లించే రాజకీయ తతంగాలకు ఇక స్వస్తి చెప్పాలి. రాజ్యాంగ పదవులకు గౌరవం ఇవ్వాలి. వ్యక్తులను వారి కులం, వర్గం ఆధారంగా కాకుండా వారి పనితీరు ఆధారంగా అంచనా వేయాలి. సభలోనైనా, సభ వెలుపలనైనా చట్టం తన పని తాను చేసుకునేలా రాజకీయ పార్టీలు వ్యవహరించాలి. తెలంగాణ ప్రజల అసలు సమస్యలపై చర్చకు రావాలి." అని కేఎస్ఆర్ గౌడ పేర్కొన్నారు.

# కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ షాద్‌నగర్ ఎమ్మెల్యేపై ఫిర్యాదు




ఇది కద నిజం, హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై షాద్‌నగర్ ఎమ్మెల్యే పెర్లపల్లి శంకర్ అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్లి ధర్నా చేస్తానని ప్రకటించడాన్ని ఖండిస్తూ కార్వాన్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్వాన్ నియోజకవర్గం తరపున శేఖర్‌రెడ్డి, కొడూరు శ్రీధర్‌సాగర్, శ్రీనివాస్‌గుప్తా, నరహరిచారి, బాబు, రఘునాథ్, వినోద్ తదితరులు పోలీసులకు ఫిర్యాదు అందజేశారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# పిట్లం జెడ్పీహెచ్‌ఎస్‌కు మహర్దశ.. రూ.5 కోట్ల నిధులు



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం: తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ పథకం కింద పిట్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేయడంపై మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు రామ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు ప్రత్యేక చొరవ, నిరంతర కృషితోనే పరిపాలనా అనుమతులు లభించాయని తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండేపై రామ్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా ఉన్నా నియోజకవర్గ అభివృద్ధిలో విఫలమైన ఆయనకు నిరసనలు తెలిపే నైతిక హక్కు లేదన్నారు. ఇసుక దందా ద్వారా భారీగా అక్రమార్జన చేసి పక్క రాష్ట్రాల్లో ఆస్తులు కూడబెట్టారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పిట్లం గ్రామ సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రవీందర్ నాయక్, యువజన విభాగం అధ్యక్షులు ఇమ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.


# తాతా మధు వ్యాఖ్యలపై దళిత సంఘాల నిరసన

## ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్

ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం: అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాదరావుపై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దళిత సంఘాల నాయకులు పిట్లం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. తాతా మధు వెంటనే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాంరెడ్డి మోహన్ రెడ్డి, పిట్లం సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు రవీందర్ నాయక్‌తో పాటు వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# టిపిడిఎంఎ పిలుపుకు మద్దతుగా భాగ్యరథి డిగ్రీ కళాశాల బంద్




ఇది కద నిజం,చింతల్: తెలంగాణలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు గత నాలుగు విద్యా సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ (RTF ) బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ మానేజ్‌మెంట్స్ అసోసియేషన్ (TPDMA) చేపట్టిన ఒకరోజు కళాశాలల బంద్‌కు చింతల్‌లోని భాగ్యరథి డిగ్రీ కళాశాల సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా కళాశాలలో బంద్ నిర్వహించగా యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్యరథి డిగ్రీ కళాశాల డైరెక్టర్ నల్ల జై శంకర్ గౌడ్ మాట్లాడుతూ గత నాలుగు ఏళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ అందకపోవడంతో ప్రైవేట్ కళాశాలలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజుల ఆలస్యం వల్ల కళాశాలల నిర్వహణ, సిబ్బందికి జీతాల చెల్లింపులతో పాటు నాణ్యమైన విద్య అందించడం కష్టతరంగా మారిందని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని, భవిష్యత్తులో సమయానికి నిధులు అందేలా శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆలస్యం వల్ల కళాశాలలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయని, ప్రభుత్వం ఇకనైనా స్పందించాలని ప్రిన్సిపాల్ నవీన్ రాజ్ స్పష్టం చేశారు. నాలుగు విద్యా సంవత్సరాల RTF బకాయిలను వెంటనే విడుదల చేసి ప్రైవేట్ కళాశాలలను, విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.






# 'ఎపిక్'కు సెన్సార్ షాక్

సంచలన విజయం సాధించిన 'బేబీ' చిత్రం తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య కాంబినేషన్‌లో 'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్' రాబోతుంది. సూపర్ హిట్ వెబ్ సిరీస్ '90s మిడిల్ క్లాస్ బయోపిక్'తో విశేష ఆదరణ దక్కించుకున్న యంగ్ డైరెక్టర్ ఆదిత్య హాసన్ ఈ రోమాంటిక్ అండ్ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌ను తెరకెక్కించారు. ఈ సినిమా సెప్టెంబర్ 11న థియేటర్లలో గ్రాండ్‌గా రిలీజ్ కావడానికి రెడీ అయిపోయింది. ఇక రిలీజ్ డేట్ దగ్గరపడుతుండటంతో తాజాగా, 'ఎపిక్'మూవీ సెన్సార్ పూర్తి చేసుకుందని మేకర్స్ వెల్లడించారు. ఈ సినిమాకు సెన్సార్ బోర్డ్ అధికారులు షాకింగ్ నిర్ణయంతో 'A' (అడల్ట్స్ ఓన్లీ) సర్టిఫికెట్ ఇచ్చారు. సెన్సార్ టీమ్ జారీ చేసిన 'A' సర్టిఫికెట్ పోస్టర్‌ను మేకర్స్ సోషల్ మీడియా ద్వారా నెటిజన్లతో పంచుకోగా, అది క్షణాల్లో వైరల్ అవడంతో పాటు హాట్ టాపిక్‌గా మారింది. ఈ నిబంధన ప్రకారం, 18 ఏళ్ల కంటే తక్కువ వయసు ఉన్న వారికి థియేటర్లలోకి ప్రవేశం ఉండదు. ఒక వైపు క్లీన్ ఫ్యామిలీ సిరీస్ తీసిన ఆదిత్య హాసన్ డైరెక్షన్‌లో రానుండగా.. ఇందులో ఆనంద్-వైష్ణవి జోడీ కావడంతో ఈ ప్రాజెక్ట్‌కి ఎలాంటి సర్టిఫికెట్ వస్తుందోనని అంతా ఆసక్తిగా చూశారు. అయితే ఊహించని విధంగా 'A' సర్టిఫికెట్ రావడం సినిమాపై విపరీతమైన క్యూరియాసిటీని పెంచేసింది.


# 'అన్బిల్ అవన్' రిలీజ్ డేట్ ఫిక్స్!




తమిళ చిత్రసీమలో అతి తక్కువ టైమ్‌లోనే విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకున్న యంగ్ హీరోయిన్ ప్రీతి ముకుందన్. రీసెంట్‌గా 'బ్లాస్ట్' మూవీతో బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేసిన ఈ బ్యూటీ, తాజాగా 'అన్బిల్ అవన్' అనే డిఫరెంట్ యాక్షన్ అండ్ రొమాంటిక్ డ్రామాతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. టాలెంటెడ్ హీరో అశోక్ సెల్వన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో ప్రీతి ముకుందన్ హీరోయిన్‌గా కనిపిస్తూ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇవ్వబోతోంది. దర్శకుడు ఆర్ కార్తికేయన్ తెరకెక్కిస్తున్న ఈ ప్రాజెక్ట్‌కి ప్రముఖ రచయిత విఘ్నేష్ రాజా కథ అందించడం విశేషం. మెలోడీ కింగ్ గోవింద్ వసంత మ్యూజిక్ అందిస్తున్న ఈ సినిమాను హ్యాపీ హై పిక్చర్స్, ఐంగరన్ ఇంటర్నేషనల్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

కథ విషయానికి వస్తే, కొత్తగా వివాహ బంధంలోకి అడుగుపెట్టిన ఒక యంగ్ జంట జీవితం చుట్టూ ఈ స్టోరీ తిరుగుతుంది. ఊహించని విపత్కర పరిస్థితుల్లో వారి అనుబంధం, పరస్పరం ఉన్న నమ్మకం, ప్రేమ ఎలాంటి సవాళ్లను దాటుకుని నిలబడ్డాయనేదే ఈ చిత్ర ముఖ్య కథాంశం. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ పూర్తి చేసుకుని విడుదలకి రెడీ అయింది. ఈ క్రమంలోనే వినాయక నిమజ్జనం పండుగ కానుకగా సెప్టెంబర్ 25న ఈ సినిమాను వరల్డ్‌వైడ్‌గా థియేటర్లలోకి తీసుకువస్తున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. "ఏమాత్రం టెన్షన్, భయం లేని.. స్వచ్ఛమైన ప్రశాంతమైన ప్రగాఢ ప్రేమకథను ఆస్వాదించండి" అనే క్యాప్షన్‌తో రిలీజ్ చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్ ప్రస్తుతం మూవీ లవర్స్‌ను ఆకట్టుకుంటోంది.

# 'దాదా'లో డార్క్ విలనిజం!



నటసింహం నందమూరి బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'దాదా' . గతంలో వీరి కాంబోలో వచ్చిన 'వీరసింహారెడ్డి' బాక్సాఫీస్ వద్ద రికార్డు విజయం సాధించడంతో, ఈ సరికొత్త యాక్షన్ మూవీపై ప్రేక్షకుల్లో భారీ ఎక్స్‌పెక్టేషన్స్ నెలకొన్నాయి. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. మనోజ్ విలన్‌గా కనిపించనున్నారు. ఈ బిగ్ ప్రాజెక్ట్‌ను వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 24న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేయడానికి మేకర్స్ వేగంగా వర్క్ పూర్తి చేస్తున్నారు. ఇక ఈ సినిమా అప్డేట్స్ కోసం అభిమానులు ఎంతగానో వెయిట్ చేస్తున్నారు. ఈనేపథ్యంలో.. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో డైరెక్టర్ గోపీచంద్ మలినేని విలన్ క్యారెక్టర్ గురించి సంచలన విషయాలు బయటపెట్టారు.


ఈ చిత్రంలో నటుడు మంచు మనోజ్ నెగటివ్ షేడ్స్ ఉన్న పవర్‌ఫుల్ పాత్రలో కనిపించబోతున్నారని స్పష్టం చేశారు. ఇప్పటివరకు మనోజ్ చేసిన రోల్స్‌కు ఇది పూర్తి ఆపోజిట్‌గా ఉంటుందని, స్క్రీన్ మీద ఆయన నటన ప్రతి ఒక్కరినీ విపరీతంగా ఆకట్టుకుంటుందని అన్నారు. బాలకృష్ణ లాంటి మాస్ ఐకాన్‌తో స్క్రీన్ షేర్ చేసుకునే అవకాశం రాగానే మంచు మనోజ్ ఎంతో ఉత్సాహంగా ప్రాజెక్ట్‌లోకి వచ్చారని గోపీచంద్ చెప్పారు. ప్రస్తుతం ఆయన పార్ట్ షూటింగ్ శరవేగంగా సాగుతోందని వెల్లడించారు. కథకి ఏ రేంజ్ నెగెటివిటీ, డార్క్ షేడ్స్ కావాలో వాటన్నింటినీ మనోజ్ తన నటనతో పర్ఫెక్ట్‌గా ప్రెజెంట్ చేస్తున్నారని.. మునుపెన్నడూ చూడని విలనిజాన్ని 'దాదా'లో చూస్తారని తెలిపారు. గోపీచంద్ మలినేని చేసిన ఈ కామెంట్స్ నెట్టింట వైరల్ అవ్వడంతో బాలయ్య వర్సెస్ మనోజ్ పోరు ఎలా ఉండబోతుందో చూసేందుకు నందమూరి అభిమానులు ఎంతో ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు.

# రంగంలోకి దిగిన లూగర్

డ్రాగన్ కోసం లూగర్ రంగంలోకి దిగాడా? అంటే, అవుననే అంటున్నారు. ఇటీవల ఎన్టీఆర్‌కు డ్రాగన్ సినిమా షూటింగ్‌లో గాయమైన సంగతి తెలిసిందే. చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ భుజానికి సర్జరీ చేశారు వైద్యులు. అలాగే.. కొద్ది రోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. దీంతో డ్రాగన్ షూటింగ్ డిలే అవుతూ వస్తోందనే టాక్ వినిపిస్తునే ఉంది. ఎన్టీఆర్ పూర్తిగా కోలుకున్న తర్వాతే ఈ సినిమా షూటింగ్‌లో జాయిన్ అవనున్నాడు. కానీ లేటెస్ట్‌గా తారక్ ఈ సినిమా సెట్స్‌లోకి అడుపెట్టినట్టుగా తెలుస్తోంది.

షోల్డర్ సర్జరీ నుంచి కోలుకున్న ఎన్టీఆర్.. డ్రాగన్ షూటింగ్‌లో మళ్లీ చురుగ్గా పాల్గొంటున్నారట. తాజా సమాచారం ప్రకారం, రామోజీ ఫిల్మ్ సిటీలో ఈ చిత్రానికి సంబంధించి కొత్త షెడ్యూల్ ప్రారంభమైంది. ఈ షెడ్యూల్‌లో భాగంగా ముందుగా కీలకమైన టాకీ పార్ట్ సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు. టాకీ పోర్షన్ పూర్తయిన తర్వాత, హై-ఆక్టేన్ యాక్షన్ సీక్వెన్స్ షూటింగ్ ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఎన్టీఆర్ మాస్ మేనియాను నెక్స్ట్ లెవెల్‌లో చూపించేలా ఈ యాక్షన్ బ్లాక్స్ ఉండబోతున్నట్లు చిత్ర యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. ఇక్కడి నుంచి బ్యాక్ టు బ్యాక్ షెడ్యూల్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే డ్రాగన్ షూటింగ్ చాలా డిలే అయింది. ఎప్పుడో థియేటర్లోకి రావాల్సిన ఈ సినిమా.. వచ్చే ఏడాది జూన్‌కి వాయిదా పడింది. ఇప్పుడు మరోసారి పోస్ట్‌పోన్ కాకుడదని వీలైనంత త్వరగా షూటింగ్ కంప్లీట్ చేయాలని భావిస్తున్నారు. కాగా ఈ చిత్రంలో ఎన్టీఆర్ సరసన రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. పవర్ ఫుల్ యాక్షన్ మూవీగా తెరకెక్కిస్తున్నాడు ప్రశాంత్ నీల్.




# మెగాస్టార్ కూతురిగా అనస్వర!

మలయాళం ఇండస్ట్రీలో తనదైన నటనతో గుర్తింపు తెచ్చుకున్న యువ కథానాయిక అనస్వర రాజన్ ఇప్పుడు తెలుగులో వరుస అవకాశాలతో బిజీగా మారుతోంది. ఇప్పటికే తెలుగు ప్రేక్షకులకు దగ్గరవుతున్న ఈ మలయాళీ బ్యూటీ.. తాజాగా మరో తెలుగు సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో టాలీవుడ్‌లో ఆమె జోరు మరింత పెరిగినట్లు కనిపిస్తోంది.ప్రస్తుతం అనస్వర రాజన్ చేతిలో ఉన్న ప్రాజెక్టుల్లో 'కాకా' మాత్రం ఆమె కెరీర్‌లోనే అత్యంత కీలకమైన చిత్రంగా నిలవనుంది. మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న ఈ భారీ సినిమాలో అనస్వర ఓ కీలకమైన పాత్రలో కనిపించనుంది. ఈ సినిమాలో ఆమె పోషిస్తున్న పాత్రపై ఇప్పటికే ఆసక్తి నెలకొనగా.. తాజాగా ఆమె పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్ లుక్ మరింత క్యూరియాసిటీని పెంచింది.

అనస్వర రాజన్ పుట్టినరోజు సందర్భంగా 'కాకా' చిత్రబృందం ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఇందులో అనస్వరను ఎంబీబీఎస్ విద్యార్థిని అమ్ములుగా పరిచయం చేశారు. చాలా సహజమైన, హోమ్లీ లుక్‌లో కనిపిస్తున్న ఆమె ఫస్ట్ లుక్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. సాధారణ గ్లామర్ లుక్‌కు భిన్నంగా.. ఓ మెడికల్ స్టూడెంట్‌గా అనస్వరను చూపించడం ప్రత్యేకంగా నిలిచింది. ఆమె పాత్ర సినిమాకు కథాపరంగా ఎంత ముఖ్యమో పోస్టర్‌లోనే హింట్ ఇచ్చినట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా అనస్వర వెనుక భాగంలో నీడలా కనిపిస్తున్న చిరంజీవి పాత్ర.. ఈ సినిమాలో వీరిద్దరి మధ్య ఉన్న బంధంపై ఆసక్తిని పెంచుతోంది.'కాకా' సినిమాలో అనస్వర రాజన్ చిరంజీవి కూతురు 'అమ్ములు' పాత్రలో నటిస్తున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. తండ్రి-కూతుళ్ల అనుబంధం సినిమాకు కీలకమైన ఎమోషనల్ పాయింట్‌గా ఉండే అవకాశం ఉందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

ఫస్ట్ లుక్‌లో చిరంజీవిని నేరుగా చూపించకుండా ఆయన నీడను మాత్రమే హైలైట్ చేయడం ద్వారా.. అమ్ములు జీవితంలో ఆయన పాత్ర ఎంత కీలకమో చెప్పే ప్రయత్నం చేసినట్లు కనిపిస్తోంది. దీంతో సినిమాలో అనస్వర పాత్ర కేవలం గ్లామర్ కోసమే కాకుండా కథలో బలమైన ప్రాధాన్యత కలిగి ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.మలయాళ సినిమాలతో కెరీర్ ప్రారంభించిన అనస్వర రాజన్.. ఇప్పుడు టాలీవుడ్‌లో వరుస ప్రాజెక్టులను దక్కించుకుంటోంది. ఇప్పటికే ఆమె నటించిన తెలుగు చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకుంటుండగా.. తాజాగా 'అంతా రాములోరు చూసుకుంటారు' చిత్రానికి కూడా సైన్ చేసింది.దీంతో తెలుగులో ఆమె చేయబోయే సినిమాల సంఖ్య నాలుగుకు చేరినట్లు తెలుస్తోంది. అయితే వీటిలో 'కాకా' మాత్రం భారీ స్టార్ హీరోతో కలిసి నటిస్తున్న కారణంగా ఆమె కెరీర్‌కు మరింత కీలకంగా మారనుంది.మెగాస్టార్ చిరంజీవి వంటి సీనియర్ స్టార్‌తో కలిసి నటించే అవకాశం రావడం అనస్వరకు పెద్ద ప్లస్‌గా మారనుంది. ముఖ్యంగా తండ్రి-కూతుళ్ల బంధం చుట్టూ కథనం సాగితే.. ఆమె నటనకు మంచి స్కోప్ ఉండే అవకాశం ఉంది.